అమృత్ 2.0.. మరింత ఆలస్యం!

- నత్తనడకన సాగుతున్న పనులు
- మున్సిపాలిటీకి రూ.93 కోట్లు మంజూరు
- పనులు పూర్తయ్యేందుకు మరో ఏడాది

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మున్సిపాలిటీ అమృత్ 2.0 పథకానికి ఎంపికై ంది. అయితే ఈ పథకం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో మంచినీటి వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యం. 50శాతం నిధులు కేంద్రం, 35శాతం రాష్ట్రం, మిగిలిన 15శాతం మున్సిపల్ ఆర్థిక సంఘం నిధుల కేటాయించనున్నారు. అయితే ఇప్పటికే మిర్యాలగూడ మున్సిపాలిటీకి రూ.93కోట్లు నిధులు విడుదల చేశారు. కానీ పనులు మాత్రం నత్తనడకన సాగుతున్నాయి.

మరో 20ఎంఎల్‌డీల నీటి సరఫరాకు ప్రణాళిక

మిర్యాలగూడ గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో పెద్ద దేవులపల్లి రిజర్వాయర్ (అప్పటి చెరువు) నుంచి పట్టణానికి పైపులైన్ ద్వారా 10ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేపట్టారు. ఆ తరువాత జనాభా మరింత పెరిగుతుండడంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మిషన్ భగీరథ పథకం ద్వారా అడవివులపల్లి మండలం చిట్యాల వద్ద నుంచి అవంతిపురం వద్దకు, అక్కడి నుంచి పట్టణానికి మిషన్ భగీరథ పథకం కింద


హౌసింగ్‌బోర్డు కాలనీలో పిల్లర్ల దశలోనే ఉన్న ట్యాంక్ నిర్మాణ పనులు

మరో 10ఎంఎల్‌డీలను నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ పథకంలో భాగంగా త్రిపురారం మండలం పెద్దదేవులపల్లి రిజర్వాయర్‌తో పాటు కంపసాగర్ చెరువు నుంచి మరో 20 ఎంఎల్‌డీలను పట్టణానికి తీసుకువచ్చేందుకు మిర్యాలగూడ మండలం వాటర్ ట్యాంకు వద్ద వాటర్ ట్రీట్‌మెంటు ప్లాంట్‌ను నూతనంగా నిర్మిస్తున్నారు. అక్కడ నుంచి శుద్ధి చేసిన నీటిని, అమృత్ పథకం కింద కడుతున్న మరో 11 ట్యాంకులకు నీటిని సరఫరా చేసేందుకు ప్రణాళికలు తయారు చేశారు. అయితే పెద్దదేవులపల్లి రిజర్వాయర్, కంపాసాగర్ చెరువుతో పాటు పట్టణంలో 11 ట్యాంకులకు నీటి సరఫరా చేసేందుకు సుమారు 40 కిలో మీటర్ల వరకు మంచినీటి పైపులైన్ నిర్మాణ పనులను చేపట్టనున్నారు.

ప్రారంభం కాని పనులు

ప్రస్తుతం అమృత్ 2.0 పథకం కింద పట్టణంలోని నందిపాడు, ఎంపీడీఓ కార్యాలయం, ఎన్ఎస్‌పీ క్యాంపు, ప్రకాశ్‌నగర్, తాళ్లగడ్డ, గ్రీన్‌సిటీ, మార్కెట్ యార్డుల్లో ఒక్కొక్కటి కాగా హౌజింగ్‌బోర్డు, ఇందిరమ్మ కాలనీలో రెండు ట్యాంకులను నిర్మించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. అయితే పట్టణంలోని చాలా వార్డుల్లో ఎక్కడా సరిగా మంచినీటి పైపులైన్లు లేకపోవడంతో పాటు మిషన్ భగీరథ పైపులైన్లు కూడా వేయలేదన్న ప్రచారం కూడా సాగుతుంది. ఒక్క హౌసింగ్‌బోర్డులో రెండు, ఇందిరమ్మ కాలనీలో ఒక్క ట్యాంకు నిర్మాణ పనులు ప్రారంభం కాగా మిగిలిన ట్యాంక్ పనులు పనులు ప్రారంభం కాలేదు.

వచ్చే వేసవికి పనులు పూర్తి



అమృత్ 2.0 పథకం కింద చేపడుతున్న ట్యాంకులు, వాటర్ ట్రీట్‌మెంటు పనులను వచ్చే వేసవి నాటికి పూర్తి చేస్తాం. ప్రస్తుతం మూడు ప్రాంతాల్లో పనులు ప్రారంభమయ్యాయి. మిగిలిన వాటిని కూడా నిర్మాణ పనులను చేపట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఈ పనులు వచ్చే వేసవి నాటికి పూర్తి చేసి మంచినీరు అందేలా చూస్తాం.

– సాయితేజ, పబ్లిక్ హెల్త్, ఏఈఈ

పేదల ఆకలి తీర్చేందుకే సన్న బియ్యం పంపిణీ

- మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి


చిరుమర్తిలో సన్న బియ్యం లబ్ధిదారులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మాడుగులపల్లి : నిరుపేదల ఆకలి తీర్చేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం మిర్యాలగూడ మండలంలోని చిరుమర్తి గ్రామంలో సన్న బియ్యం లబ్ధిదారుడు తాళ్లపల్లి సత్యనారాయణ, లక్ష్మి ఇంట్లో ఆయన సహపంక్తి భోజనం చేసి మాట్లాడారు. ధనవంతులతో సమానంగా పేదవారు కూడా సన్న బియ్యంతో భోజనం చేయాలన్న సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం అందిస్తుందన్నారు. పేదలు సన్న బియ్యం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు గడ్డం వేణు గోపాల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పుల్లెంల సైదులు, పురుషోత్తంరెడ్డి, నరసింహా, ప్రసాద్, ఉషయ్య, కట్టా సిద్దార్థరెడ్డి, మునుగోటి యాదయ్య, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

మిర్యాలగూడ టౌన్ : తనపై కారణంలేకుండా దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో బాధితుడు మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి గ్రామానికి చెందిన బొబ్బల వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశారు. యాద్గార్‌పల్లి గ్రామంలో తన ఇంటి ఖాళీ స్థలంలో పశువులకు గడ్డి వేస్తుండగా గ్రామానికి చెందిన అప్పనబోయిన రామకృష్ణ, అప్పనబోయిన వెంకటయ్యలు తన స్థలంలో గడ్డి పెట్టవద్దని, అసభ్యకరంగా మాట్లాడుతూ వెంకటయ్య అనే వ్యక్తి తనపై దాడికి పాల్పడ్డాడు. దీంతో రక్తం వచ్చిందని, అదే విధంగా అడ్డం వచ్చిన తన కుమారుడు ప్రశాంత్‌ను కూడా రాళ్లతో కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. తన భార్యను కూడా వెంకటయ్య, రామకృష్ణలు ఇష్టం వచ్చినట్లు బూతులు తిట్టారని వినతి పత్రంలో పేర్కొన్నారు. వారితో తన కుటుంబానికి ప్రమాదం పొంచి ఉందని, ఈ విషయంపై విచారణ జరిపి దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

క్లుప్తంగా

ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌కు ఘన స్వాగతం


శంకర్‌నాయక్‌కు స్వాగతం పలుకుతున్న కెతావత్ తండావాసులు

మిర్యాలగూడ : ఎమ్మెల్యే కోటాలో ఇటీవల ఎమ్మెల్సీగా ఎన్నికై ప్రమాణ స్వీకారం చేసి తొలిసారిగా దామరచర్ల మండలంలోని తన సొంత గ్రామం కెతావత్ తండాకు శనివారం శంకర్‌నాయక్ వెళ్లారు. దీంతో ఆ తండావాసులు శంకర్‌నాయక్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీని పూలదండాతో ఘనంగా సత్కరించారు. అనంతరం తన తల్లిదండ్రుల సమాధి వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి


పాఠశాలలకు వంట సామగ్రి పంపిణీ చేస్తున్న ఎంఈఓలు వెంకటయ్య, శ్రీనయ్య

పెద్దఅడిశర్లపల్లి : ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని పెద్దఅడిశర్లపల్లి, గుడిపల్లి ఎంఈఓలు వెంకటయ్య, శ్రీనయ్యలు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో 24 పాఠశాలలకు మంజూరైన వంట సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల స్వీకరణ


దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

నిడమనూరు : రాజీవ్ యువవికాసం దరఖాస్తుల స్వీకరణకు మరో రెండు రోజులు ఉండటంతో పెద్ద సంఖ్యలు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. నిడమనూరు మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ద్వారా శనివారం 76 దరఖాస్తులు స్వీకరించినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బోనగిరి రమేశ్ తెలిపారు. దరఖాస్తు స్వీకరణ, సందేహాలకు రాజీవ్ యువవికాసం మండల పరిషత్ కార్యాలయంలోని ప్రత్యేక కౌంటర్లలో సంప్రదించవచ్చని ఎంపీడీఓ తెలిపారు.

తిరునగరు గంగాధర్‌కు నివాళి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

మిర్యాలగూడ : స్వాతంత్య్ర సమరయోధుడు, మాజీ సైనికుడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తిరునగరు గంగాధర్ జయంతిని శనివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సాగర్‌రోడ్డులోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్‌లు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో క్రీడాకారిణికి సన్మానం


వైశాలిని సన్మానిస్తున్న నరసింహారెడ్డి

మిర్యాలగూడ : ఇటీవల నిర్వహించిన 57వ సీనియర్ ఖోఖో అసోసియేషన్ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న దామరచర్లకు చెందిన నూకల వైశాలిని శనివారం దామరచర్ల మండల కాంగ్రెస్‌పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కందుల నరసింహారెడ్డి శాలువాతో ఘనంగా సన్మానించారు. వైశాలి అండర్–14, 16, 17 విభాగాల్లో నల్లగొండ జిల్లా తరుపున ఆడగా అండర్–18 విభాగంలో తెలంగాణ రాష్ట్రం తరువున కెప్టెన్‌గా ఎంపికై తన ప్రతిభను చాటుతుంది. కార్యక్రమంలో కిట్టయ్య, రాము పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత


తిరుమలగిరి : కొంపల్లిలో ఎమ్మెల్సీ కోటిరెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని, ప్రతి ఒక్కరూ దైవ భక్తిని అలవర్చుకోవాలని ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. శనివారం తిరుమలగిరి మండలంలోని కొంపల్లిలో నిర్వహించిన చెన్నకేశవస్వామి కల్యాణంలో ఆయన పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సామాజిక బేధాలు లేకుండా మన ధర్మాన్ని సమైఖ్యపరచాలని, సమతాహాభావన పెంచుకోవాలని తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మీసాల వెంకటేశ్వర్లు, జంగాల చెన్నయ్య, బురువు నాగార్జున, వెంకటయ్య, కిరణ్, శ్రీను, గీత, కొండలు, లక్ష్మయ్య, సైదయ్య, మధు, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు


గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సర్టిఫికెట్లతో విద్యార్థినులు

మిర్యాలగూడ టౌన్ : పట్టణానికి చెందిన సిరిమువ్వ నాట్యాలయ చిన్నారులు నృత్యంలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించినట్లు ఆ నాట్యాలయ గురువ కలకొండ రాము శనివారం విలేకరులకు తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో తెలంగాణ పరిషత్‌లో నిర్వహించిన సభలో ప్రముఖ నాట్య గురువు పసుమర్తి శేషుబాబు, వేదాంతం వెంకటశర్మ, సిరియల్ ఆర్టిస్ట్ జ్యోతిరెడ్డి గిన్నిస్ బుక్ రికార్డు సర్టిఫికెట్లు అందుకున్నట్లు తెలిపారు. గిన్నిస్ బుక్ రికార్డుల్లో చోటు సంసాదించినందుకు డివిజన్ డాన్స్, స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అలుగుబెల్లి వెంకట్ చిన్నారులను అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హాలియా : మండలంలోని రామడుగు సబ్‌స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాలకు విద్యుత్ సరఫరాల్లో అంతరాయం ఉంటుందని ఏఈ ధనరాజ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుముల మండలంలోని 33/11కేవీ రామడుడు సబ్ స్టేషన్ నుంచి వచ్చే 11 కేవీ తిమ్మాపురం అగ్రికల్చర్ ఫీడర్ లైన్‌కు తగులుతున్న చెట్ల కొమ్మలను కొట్టడానికి ఆ ఫీడర్ పరిధిలో పలు ప్రాంతాలకు ఉదయం 7.30 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

త్రిపురారం : నిడమనూరు మండలంలోని ముకుందాపురం ఇండస్ట్రియల్ ఫీడర్ 11 కేవీ విద్యుత్ లైన్‌కు ఆనకొని ఉన్న చెట్లు తొలగించడంతో పాటుగా మరమత్తుల కారణంగా నేడు ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు త్రిపురారం విద్యుత్ ఏఈ బాలు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా పరిధిలోని గ్రామాల్లోని గృహ, వాణిజ్య, పరిశ్రమల విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని పేర్కొన్నారు.

గడువు పెంచాలని సీఎంకు లేఖ

మిర్యాలగూడ టౌన్ : రాజీవ్ యువ వికాసం దరఖాస్తు గడువును ఈనెల చివరి వరకు పెంచాలని కోరుతూ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి శనివారం లేఖ రాశారు. చాలా మంది యువకులు వివిధ కారణాలతో పాటు సర్వర్ డౌన్ కావడంతో దరఖాస్తులు చేసుకోలేకపోయారని, ఈనెల 14వ తేదీతోనే దరఖాస్తు గడువు ముగుస్తున్నందున యువత ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. వరుసగా సెలవులు రావడంతో చాలా మంది యువత కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను తీసుకోలేకపోయారని, చాలా మందిని తహసీల్దార్ కార్యాలయాల్లోనే ఉన్నాయని, అందువల్ల గడువు పెంచాలని ఆ లేఖలో వివరించారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్సీ పరామర్శ


బోయగూడెంలో శ్రీనివాస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : మండల కేంద్రానికి చెందిన బత్తుల సత్యనారాయణ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి శనివారం మృతుడి నివాసానికి వెళ్లి మృతదేహం పై పూలమాల వేసి నివాళులర్పించి, ఆ కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే మండలంలోని బోయగూడెం గ్రామానికి చెందిన వంగూరి శ్రీనివాస్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో శనివారం బోయగూడెంలో నిర్వహించిన సంతాప సభలో పాల్గొని నివాళులర్పించి, ప్రగాఢ సానుభూతి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన వెంట నాయకులు అల్లి పెద్దిరాజు, నాగేండ్ల వెంకట్‌రెడ్డి, పగడాల సైదులు, పాతన బోయిన భాస్కర్, సురేష్, కృష్ణారెడ్డి, లింగారెడ్డి, కృష్ణప్రసాద్, పల్లేటి బిక్షం, సత్యంరెడ్డి, కోటేష్, వెంకటేశ్వర్లు, లింగయ్య, బంగారి, వసంతం, రవి తదితరులు ఉన్నారు.

వైభవంగా వీర హనుమాన్ విజయయాత్ర


మిర్యాలగూడ టౌన్: హనుమాన్ విజయాత్రలో పాల్గొన్న భక్తులు


దేవరకొండ : విజయయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలో హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్‌ల ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఎన్ఎస్‌పీ కార్యంపు శాంతి నగర్ సీతారామ చంద్రస్వామి ఆలయం నుంచి హనుమాన్ శోభాయాత్రను ప్రారంభించారు. ముందుగా హనుమాన్ జయంతి సభను మెదక్ వ్యాస పీఠం శ్రీశ్రీశ్రీ శాంతనందగిరి మహారాజ్ గురూజీ ప్రారంభించారు. హనుమాన్ శోభయాత్రను స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ తిరునగర్ భార్గవ్‌ల కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు. హనుమాన్ జయంతిలో భాగంగా పట్టణ పరిసరాల నుంచి భారీగా హనుమాన్ భక్తులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రేపాల పురుషోత్తంరెడ్డి, బంటు సైదులు, రమేష్, సత్యప్రసాద్, అభి, సుధాకర్, ఉమాకర్, రవీందర్, వెంకన్న, నిలిమారెడ్డి, శ్రీనివాస్ తెలిపారు.

దేవరకొండ : హనుమాన్ జయంతిని పురస్కరించుకొని విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో శనివారం దేవరకొండ పట్టణంలో శ్రీ వీరహనుమాన్ విజయయాత్రను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శ్రీ భ్రమరాంభ మల్లిఖార్జున స్వామి దేవాలయం నుంచి ప్రారంభమైన విజయయాత్ర ప్రధాన రహదారుల గుండా కొనసాగింది. ఈ సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో వీర హనుమాన్ విజయయాత్ర కనుల పండువగా సాగింది. మహిళల కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ముఖ్యవక్తగా హాజరైన శ్రీశ్రీశ్రీ ఆదిత్య పరాశ్రీ గురువు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గుంటోజు రామకృష్ణ, రామలింగయ్య, ఐతరాజు శ్యాం, బీజేపీ నాయకులు చెనమోని రాములు, కర్నాటి సురేష్, నక్క వెంకటేష్, గుండాల అంజయ్య, వస్కుల సుధాకర్, సంతోష్ కుమార్, నేతాళ్ల వెంకటేష్, జల్దా భాస్కర్, చండీశ్వర్, ఫణి,శ్రీను, కర్నాటి సురేందర్, భజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ నాయకులు, ఉన్నారు.


చింతపల్లి : ఆంజనేయ స్వామి పూజలు చేస్తున్న భక్తులు

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : హనుమాన్ జయంతి వేడుకలను శనివారం మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని గర్కునటీతండాలో హనుమాన్ మాలదారులను ఉమ్మడి నల్లగొండ జిల్లా ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హనుమాన్ మాలదారులు బిక్షా నాయక్, దేశబాలు, రంగసాయి, రాములు, కిషోర్, లాలు, రవీంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

నిడమనూరు : హనుమాన్ జయంతి సందర్భంగా పలు ఆలయాల్లో ఆకుపూజ, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. వేంపాడు గ్రామంలోని పురాతన ఆంజనేయస్వామి ఆలయంలో ప్రసాద్ అర్చకుడు ఆంజనేయస్వామిని ప్రత్యేక అలంకరణ, ఆకు పూజ చేసి, ప్రత్యేక పూజలు చేశారు. నిడమనూరు, తుమ్మడం, రామాల్యంలోని ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అర్వ అశోక్ కుమార్ స్వాతి, మారెమ్మ, అంజయ్య యాదవ్, పొట్టుముత్తు లక్ష్మయ్య, మిట్టపల్లి రాంబాబు, రాము, తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: మండల కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల్లో శనివారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి హనుమాన్ విగ్రహంతో గ్రామ పురవీధులలో ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు యువకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో తల్లీబిడ్డలకు పోషకాహారం


మిర్యాలగూడ టౌన్ : మాట్లాడుతున్న సూపర్‌వైజర్ పద్మ


పెద్దవూర : కొత్తగూడెంలో మాట్లాడుతున్న ఏసీడీపీఓ సువర్ణ

హాలియా : పోషకాలు ఉన్న ఆహారం తీసుకుంటేనే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్ వైజర్ రమాదేవి అన్నారు. శనివారం అనుముల ప్రాజెక్టు హాలియా సెక్టార్ పరిధిలోని హాలియా–3 అంగన్‌వాడీ సెంటర్‌లో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ నర్మద, విజయలక్ష్మి, కల్పన, వజ్రమ్మ, గర్భిణులు, తల్లులు, కిశోర బాలికలు ఉన్నారు.

పెద్దవూర : గర్భిణులు, బాలింతలు, చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోని పౌష్టికాహారాన్ని పొందాలని ఏసీడీపీఓ సువర్ణ అన్నారు. శనివారం మండలంలోని కొత్తగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషన్ పక్వాడాలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శశికళ, పాఠశాల హెచ్ఎం హనుమ, ఉపాధ్యాయులు భవాని, అమల, అంగన్‌వాడీ టీచర్లు గాలి మంగమ్మ, శ్రీదేవి పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్ : గర్భిణులు, బాలింతలు, పిలలు ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ పద్మ అన్నారు. శనివారం పట్టణంలోని సీతారాంపురంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షం కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు విజయ, గౌసియా, అంజమ్మ ఉన్నారు.

త్రిపురారం : మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ రోజు వారి ఆహారంలో తప్పనిసరిగా పోషకాలు ఉండేవిదంగా చూసుకోవాలని అంగన్‌వాడీ సిబ్బంది తెలిపారు. శనివారం దామరచర్ల ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని దుబ్బ అంగన్ వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పోషకాహారం పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శారద, హెల్త్ సూపర్ వైజర్లు పుట్ట గోపాల్ రెడ్డి, కమలమ్మ, ఎంఎల్‌ఎచ్‌పీ శ్రవణ్ కుమార్, ఏఎన్ఎమ్ బాణావత్ జ్యోతి పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు

నిడమనూరు : పోషణ పక్షోత్సవంలో భాగంగా మండలంలోని రాజన్నగూడెం–2 అంగన్‌వాడీ సెంటర్ లో సామూహిక సీమంతాలు, అక్షరాభ్యాసాలు నిర్వహించారు. సీడీపీఓ ఉదయశ్రీ మాట్లాడారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ సైదాబేగం, ఏఎన్ఎం మమత, అంగన్‌వాడీ టీచర్లు, రాజేశ్వరీ, ఝాన్సీలక్ష్మి రాణి, సునీత గర్భిణులు, బాలింతులు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

'మా భూమి' రథయాత్రను జయప్రదం చేయాలి

హాలియా : రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్యస్థాపన కోసం, ప్రజా సమస్యల పరిష్కా రానికి ఈనెల 14న ఆదిలాబాద్ జిల్లాలో చేపట్టనున్న మా భూమి రథయాత్రను విజయవంతం చేయాలని ధర్మ సమాజ్ పార్టీ అనుముల మండల అధ్యక్షుడు మామిడి రవి పిలుపునిచ్చారు. శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ధర్మ సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు డాక్టర్ విశారధన్ మహారాజ్ నేతృత్వంలో ఈనెల 14న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి రోజున ఆదిలాబాద్ నుంచి రథయాత్ర ప్రారంభమై మూడు సంవత్సరాల మూడు నెలల పాటు రాష్ట్రంలోని అన్ని గ్రామాలను చుడుతూ చివరిగా హైదరాబాద్‌కు చేరుకుటుందన్నారు. రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని ఎదిరించి న్యాయం జరిగేలా చేయడంతో పాటు ప్రతి గ్రామంలో ఉన్న సమస్యలను నేరుగా తెలుసుకుంటారన్నారు. 90 శాతం మంది ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం, ఉపాధి హామీ, ఇల్లు ప్రతి ఒక్కరికి అందించాలన్నదే లక్ష్యమన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఈ యాత్రలో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి


ట్రాక్టర్లకు రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయిస్తున్న ఎస్ఐ సతీష్‌రెడ్డి

హాలియా : ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించాలని హాలియా ఎస్ఐ సతీష్‌రెడ్డి అన్నారు. హాలియా పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో అనుముల మండలంలోని వజ్రతేజ రైస్ మిల్లుకు ధాన్యం లోడుతో వచ్చే ట్రాక్టర్లకు రేడియం స్టిక్కర్లు అంటించి డ్రైవర్లుకు అవగాహన కల్పించారు. ధాన్యం లోడుతో రైస్ మిల్లుకు వచ్చే ట్రాక్టర్లకు ముందు, వెనుకభాగం రేడియం స్టిక్కర్లు లేని కారణంగా హాలియా–నల్లగొండ జాతీయ రహదారిపై తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని నియంత్రించేందు ట్రాక్టర్లకు రేడియం స్టిక్కర్లు అంటించినట్లు తెలిపారు. అనంతరం ట్రాక్టర్ డ్రైవర్లకు పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ రమేష్, డ్రైవర్లు ఉన్నారు.

అంబేడ్కర్ స్టడీ సెంటర్‌లో వారోత్సవాలు

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ పట్టణంలోని అంబేద్కర్ రీజనల్ స్టడీసెంటర్‌లో డాక్టర్ బీఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా సామాజిక సాధికారత వారోత్సవాలు శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎన్జీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ నర్సింగ్ కోటయ్య పాల్గొని 'భారత రాజ్యాంగం సామాజిక న్యాయం' అనే అంశంపై మాట్లాడారు. ఈ సందర్భంగా రాజ్యాంగ ప్రవేశికను ఎలా అర్థం చేసుకున్నారు అనే అంశంపై విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ డాక్టర్ అంతటి శ్రీనివాస్, బి.అనిల్‌కుమార్, లైబ్రేరియన్ డాక్టర్ ఏ.దుర్గాప్రసాద్, అధ్యాపకులు బాలకిషోర్, పాష, ఖలీముద్దీన్, సిబ్బంది శ్రీకాంత్ పాల్గొన్నారు.

కంకర పోశారు.. బీటీ మరిచారు

- ఏడాదిగా నిలిచిన రోడ్డు నిర్మాణ పనులు
- అవస్థలు పడుతున్న వాహనదారులు


రోడ్డుపై పోసిన కంకర

చందంపేట : మండల కేంద్రం నుంచి పేర్వాల గ్రామానికి వెళ్లేందుకు రెండేళ్ల క్రితం బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. దీంతో ఏడాది క్రితం పనులు మొదలు పెట్టి కేవలం కంకర పరిచి వదిలేశారు. దీంతో ఏడాది కాలంగా ఎంతో మంది వాహనదారులు ప్రమాదాల బారిన పడగా.. ఈ దారి గుండా ప్రయాణమంటేనే జంకాల్సిన పరిస్థితి నెలకొంది. మండల కేంద్రం నుంచి పేర్వాల గ్రామానికి వెళ్లేందుకు 4 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణంలో భాగంగా ఏడాది క్రితం ఉన్న రోడ్డును తొలచి కంకర పరిచారు. ఆ తదుపరి ఎలాంటి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టకపోగా ఏడాది కాలంగా ఈ కంకరపై రాకపోకలు సాగించలేక వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికే పలువురు వాహనదారులు ప్రమాదాలకు గురి కాగా వాహనాలు త్వరగా రిపేర్లకు వెళ్తున్నాయని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికై న సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణపనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతున్నారు.

పనులు మొదలు పెట్టాలి

నేరెడుగొమ్ము నుంచి పేర్వాల ఊరుకు వెళ్లేందుకు రోడ్డు నిర్మాణం కోసం కంకర పరిచి ఏడాది అవుతుంది. కంకరపై వాహనాలు నడపడానికి నానా ఇబ్బందిగా ఉంది. ఎప్పుడు బండి కిందపడి ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంది. ఇప్పటికై న రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి.

– చిత్రియాల చెన్నకేశవులు